ఏజెన్సీ గ్రామంలో మద్యపాన నిషేధం

నల్లబెల్లి, సెప్టెంబర్ 21: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలానికి సరిహద్దులో ఉన్న ఏజెన్సీ గ్రామం గొల్లపల్లె సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో 750 మంది జనాభా ఉండగా.. చాలా మంది యువత గుడుంబా, మద్యానికి బానిసై యుక్తవయస్సులోనే మృత్యువాత పడ్డా రు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మరికొందరు గుడుంబాకు బానిసై కష్టపడి సంపాదించిదంతా తాగుడుకే ఖర్చు చేస్తున్నారు. కుటుంబాలను పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన గ్రామప్రజలు.. గ్రామం బాగుపడాలంటే మద్యపాన నిషేధమొక్కటే మార్గమని నిర్ణయించుకున్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి

- మా భూములను వాపసు ఇవ్వాలి
- నాలుగు గ్రామాల రైతులు డిమాండ్
- సోనియా, రాహుల్‌కు లేఖలు

యాచారం, సెప్టెంబర్ 21: యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాస్తున్నారు. ఇప్పటికే నానక్‌నగర్ గ్రామానికి చెందిన 200 మంది రైతులు లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఫార్మాసిటీ వద్దంటూ తాజాగా శనివారం కుర్మిద్ద గ్రామానికి చెందిన కొంత మంది రైతులు పోస్టుకార్డులతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మాసిటీని రద్దుచేయాలని, తమ నుంచి సేకరించిన భూములను తిరిగి ఇవ్వాలని ఆ లేఖల్లో డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం రైతులతో కలిసి పాదయాత్ర చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీలు కోదండరామ్, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదవులను చేపట్టగానే ఫార్మా బాధిత రైతులను మర్చిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్యూచర్‌సిటీ అంటున్నారే తప్ప ఫార్మాసిటీని రద్దు చేసినట్టు ఎక్కడా జీవో చూపించడం లేదని మండిపడుతున్నారు. పైగా ఫార్మాసిటీని నిర్మించి తీరుతామని హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని ఇప్పటికైనా ఫార్మాసిటీని రద్దు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులను తమ గ్రామాల్లో తిరుగనివ్వబోమని హెచ్చరించారు.

ఫార్మాసిటీ వద్దంటూ రాసిన ఉత్తరాన్ని చూపుతున్న తాటిపర్తి గ్రామ మహిళ

ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

ప్రజాగ్రంథాలయంలో నేడు దశాబ్ది ఉత్సవాలు

- 2023 కథల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ
- 'నమస్తే తెలంగాణ-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' నిర్వహణ

హనుమకొండ సబర్బన్, భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21: ముల్కనూరు ప్రజాగ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమైంది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నది. ఇదే తరహాలో నిర్వహించిన 'కథల పోటీలు-2023' విజేతల ఎంపిక ప్రక్రియ పూర్తికాగా.. ఆదివారం దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇదే వేదికపైనే విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 2014లో ఆ గ్రామ పూర్వ విద్యార్థులు ప్రజాగ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా ఎదిగి ముల్కనూరు ప్రజాగ్రంథాలయంగా రూపుదిద్దుకొన్నది. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ఈ గ్రంథాలయం ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. ముఖ్య అతిథులుగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, తెలుగు కవి అందెశ్రీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి హాజరుకానున్నట్టు నిర్వాహకులు సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వంగ రవి తెలిపారు.

ఎల్లంపల్లిని పూర్తి చేసిందెవరు?

- కాంగ్రెస్ ప్రాజెక్టు పూర్తి చేస్తే నీళ్లెందుకు నింపలె?
- మంత్రి పొన్నం వ్యాఖ్యలపై నెటిజన్ల విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అవి కాళేశ్వరం జలాలు కావు' అని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి గప్పాలు తప్ప మరేమీలేదని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవంగా ఎల్లంపల్లి ప్రాజెక్టును తా మే నిర్మించామని కాంగ్రెస్ సర్కారు చెప్తున్న గొప్పలన్నీ కూడా ఒట్టి మాటలే. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసినా దానిని వినియోగంలోకి తీసుకురాలేదన్నది అంతే వాస్తవం. జలయజ్ఞంలో భాగంగా 2004లో రూ.3,177 కోట్ల తో 20.16టీఎంసీల నీటి నిల్వసామర్థ్యంతో ఎల్లంపల్లి ప్రాజెక్టును చేపట్టారు. తెలంగాణ వచ్చేనాటికి ప్రాజెక్టుపై రూ.3,347.27 కోట్లు ఖర్చుపెట్టారు. తెలంగాణ ఏర్పడేనాటికి ఏనా డూ ఆ రిజర్వాయర్‌లో 5 టీఎంసీలకు మించి జలాలను నిల్వ చేయలేదు. కారణం భూసేకరణ పూర్తి చేయకపోవటం, ముంపు బాధితులకు పునరావాసం కల్పించకపోవడమే. ప్రాజెక్టు కోసం మొత్తంగా 27,387ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 18,778 ఎకరాలను మాత్రమే సేకరించింది. ఇక పునరావాసం కల్పనకు 13,296 ఇండ్లను నిర్మించాల్సి ఉండగా, 1,448 ఇండ్లను మాత్రమే పూర్తిచేసింది. అదీగాక ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ వల్ల లక్షెటిపేట బ్రిడ్జి మునిగిపోయి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో రూ.2,052.73 కోట్లను వాటి కోసం వెచ్చించింది. బరాజ్‌ను 2016లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది. ఇదీ వాస్తవం. కానీ అందుకు విరుద్ధంగా ప్రాజెక్టు మొత్తం పూర్తిచేశామని మంత్రి పొన్నం వ్యాఖ్యానించడంపై తెలంగాణవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు. అదీగాక ఎల్లంపల్లి నుంచే నీళ్లను తరలించామని చెబుతున్న మంత్రి పొన్నం వాటిని ఏవిధంగా తరలించారో కూడా చెబితే బాగుండేదని చురకలంటిస్తున్నారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని తెలంగాణవాదులు వివరిస్తున్నారు. అం తేకాదు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌లోనే ఎల్లంపల్లి, నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్‌మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భాగమై ఉన్నాయని అంగీకరించిన పొన్నం మరి ఆ యా రిజర్వాయర్లను నాడు ఎందుకు పూర్తి చేయలేదో కూడా చెబితే బాగుండేదని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కేసీఆర్ రీడిజైన్ ఫలితంగానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో 14టీఎంసీలుగా నీటి నిల్వ సామర్థ్యం ఏకంగా 141టీఎంసీలకు పెరిగిందని తెలంగాణవాదులు గుర్తుచేస్తున్నారు.

ఎల్లంపల్లి నుంచే నీళ్లు ఎత్తిపోశాం: పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే ప్రస్తుతం మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అయినా కాళేశ్వరం జలాలు అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుదోవ పట్టిస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మం త్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులోనే రూపకల్పనలోనే ఎల్లంపల్లి , నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్ మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగ ర్ భాగమై ఉన్నాయని చెప్పారు. గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. కేసీఆర్ చేసిన రీడిజైన్ నిరుపయోగమని, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్‌కు వచ్చే నీరు ఎల్లంపల్లి నుంచి తీసుకున్నవి మాత్రమేనని, విడతల వారీగా వర్షాలు కురవడం వల్లే అది సాధ్యమైందని తెలిపారు. ఆగిన పనులు పూర్తి చేసినంత మాత్రాన ప్రాజెక్టు రూపొందించినట్టవుతుందా? అని ప్రశ్నించారు.

ఫార్మాసిటీ అక్కడే ఉంటుందా..లేదా?

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడంలేదని తప్పుపట్టారు. ఫార్మాసిటీ భూములకు సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపడతామని, ఆ లోగా ప్రభుత్వ నిర్ణయంతోపాటు ఫార్మాసిటీకి సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాల్సిందేనని తేల్చిచెప్పారు. కాగా, ఫార్మాసిటీ యథాతథంగా కొనసాగుతుందంటూ హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఫార్మాసిటీ రద్దయినట్టు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆ అఫిడవిట్‌లో పేర్కొంటూ.. 2016 లో జారీ చేసిన జీవో 31 ప్రకారం ఫార్మాసిటీ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం మేడిపల్లిలో 1,700 ఎకరాల సేకరణకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11(1) కింద గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఇదే ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 2016లో ప్రభుత్వం జీవో 31ను జారీ చేసిందని, అంతేకాకుండా భూసేకరణ చట్టం కింద కొన్ని మినహాయింపులు ఇస్తూ జీవో 46ను జారీ చేసిందని తెలిపారు. డిక్లరేషన్, పరిహారం అవార్డు నిబంధనల ప్రకారం జరగలేదన్న ఆరోపణలు అవాస్తవమని, భూసేకరణ చట్టంలోని నిబంధనల ప్రకారమే అక్కడ భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో పిటిషనర్‌కు సంబంధించిన 10 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. డిక్లరేషన్ అవార్డుపై పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారని, విచారణ జరిపిన హైకోర్టు.. అభ్యంతరాల స్వీకరణ సహా భూసేకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించిందని వివరించారు. ఈ ఆదేశాల ప్రకారం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ అమల్లోనే ఉన్నదని, ఈ నేపథ్యంలో సదరు భూములపై ధరణి పోర్టల్‌లో లావాదేవీలకు అనుమతించాలన్న పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తన భూములపై ధరణి పోర్టల్ ద్వారా ఎలాంటి లావాదేవీలు నిర్వహించలేరని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ అమల్లో ఉన్నందున ధరణిలో ఎంట్రీల కోసం పిటిషనర్ చేసుకున్న దరఖాస్తును అనుమతించలేమని స్పష్టం చేశారు. అంతేకాకుండా అవార్డు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీళ్లు దాఖలు చేశామని, అవి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ నిమిత్తం రెండు పత్రికల్లో నోటిఫికేషన్‌ను ప్రచురించామని, గ్రామసభ నిర్వహించి నోటీసులు జారీచేయడంతోపాటు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు ఆవశ్యకతను అందరికీ వివరించామని చెప్పారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున్న పరిహారం ఇవ్వాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆ తర్వాత దాన్ని రూ.16 లక్షలకు పెంచామని, దానికి అదనంగా రైతులకు 121 చదరపు గజాల చొప్పున స్థలాలను కూడా కేటాయిస్తున్నామని వివరించారు. నోటీసులకు సమాధానం ఇవ్వనందున అధికారులు జారీ చేసిన పరిహారం మొత్తాన్ని భూసేకరణ అథారిటీ వద్ద డిపాజిట్ చేశామని తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధుల బహిష్కరణ

నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వనపర్తి జిల్లా కొత్తకోట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, వాచ్‌మెన్, ప్లాంబర్ కం ఎలక్ట్రీషన్, గెస్టు ఫ్యాకల్టీ ఉద్యోగులు శనివారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య రాలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. -కొత్తకోట

రాచర్ల వెంకన్నకు శాలివాహన విశిష్ట పురస్కారం

రాచర్ల వెంకన్న

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమ నేత ప్రము ఖ ఉపాధ్యాయుడు రాచర్ల వెంకన్న శాలివాహన విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యా రంగంలో ఉభయ తెలు గు రాష్ట్రాల్లోని శాలివాహన ఉత్తమ గురువులకు శాలివాహన చారిటబుల్ ట్రస్టు హైదరాబాద్ సంస్థ పురస్కారాలను అందజేస్తున్నది. ప్రతియేటా అందిస్తున్న ఈ పురస్కారాలకు సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాచర్ల వెంకన్నను ఎంపిక చేసిం ది. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేడు ఆదివారం పురస్కారాన్ని అందుకోనున్నారు. గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డి గ్రామానికి చెందిన వెంకన్న తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లాలో స్వరాష్ట్ర ఉద్యమానికి జరిగిన పోరాటంలో ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులను కదిలించి ఉద్యమబాట పట్టించారు. ఆయన పురస్కారానికి ఎంపికవడంపై ప్రముఖ కథా రచయిత పెద్దింటి అశోక్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు జూపల్లి నాగేందర్‌రావు, సభ్యులు పాత సుధాకర్, బోడ రవీందర్, పయ్యావుల శ్రీనివాస్, చిట్యాల శ్రీనివాస్, బూట్ల మోహన్, నళినీకాంత్, సిరిసిల్ల తిరుపతి, తిరుమలేశ్, రాంగోపాల్, పోకల వేణు హర్షం వ్యక్తం చేశారు.

హాస్టల్ విద్యార్థులపై సర్కార్ చిన్నచూపు

- బీఆర్‌ఎస్‌వీ నాయకుడు మెంగని మనోహర్

ఎల్లారెడ్డిపేటలో చికిత్స పొందుతున్న రోహిత్‌ను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్, సెప్టెంబర్ 21: ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని బీఆర్‌ఎస్‌వీ నాయకుడు మెంగని మనోహర్ శనివారం విమర్శించారు. ఇల్లంతకుంట మండలం గాలిపల్లి బీసీ హాస్టల్‌లో పాముకాటుకు గుర్త్రై ఎల్లారెడ్డిపేటలో చికిత్స పొందుతున్న ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన బాలుడు రోహిత్‌ను పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో ఏదో మూల, ఏదో సంఘటన జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని దుయ్యబట్టారు. గురుకులాల్లో నాణ్యత లేని భోజనంపై ఆరోపణలొస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. పేదలు చదువుతున్న హాస్టళ్లలో వసతులు, భోజన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు సింగారం దేవరాజు, శీలం స్వామి, కొర్రి అనిల్, ములిగె ప్రమోద్, జుబేర్, జహంగీర్ ఉన్నారు.

అశ్వితకు డీఎంహెచ్‌వో పరామర్శ

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్21: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న పర్లపల్లి అశ్విత పాఠశాల భవనంపై నుంచి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. కాగా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న బాలికను జిల్లా వైద్యాధికారి వసంతరావు శనివారం పరామర్శించారు. విద్యార్థిని మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వెన్నుపూసలో చిన్న ఫ్రాక్చర్స్ ఉన్నాయని, అపరేషన్ లేకుండానే నయం అవుతుందని కుటుంబసభ్యులకు తెలిపారు. ఆమె మానసిక పరిస్థితిపై వెంటవెంటనే సమాచారం తెలుసుకోవాలని, సంబంధిత వైద్య నిపుణులకు ఫోన్‌లో సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి మండల వైద్యాధికారి స్రవంతి, దవాఖాన ఎండీ అభినయ్ ఉన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి, సెప్టెంబర్ 21: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ తనిఖీకి వచ్చిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందించారు. కేజీబీవీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఎనిమిదో తరగతి విద్యార్థిని అశ్విత ఆత్మహత్యయత్నం చేసిందని తెలిపారు. అలాగే, పాఠశాల సమయానికి బస్సులు రావడం లేదని విన్నవించగా, డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉదయం, సాయంత్రం బస్సు ట్రిప్పులు పెంచాలని సూచించారు.

అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్, సెప్టెంబర్ 21 : విద్యార్థుల పట్ల అసభ్యకరమైన పదజాలం వాడిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన తెలిపారు. అధ్యాపకుడు అసభ్యకర పదజాలంతో ఇబ్బందులకు గురిచేశారని విద్యార్థులు తెలిపారన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజు, విశాల్, రేవిక, తదితరులున్నారు.

విద్యార్థిని భవనమెక్కితే మీరేం చేస్తున్నరు..?

- సిబ్బంది అందుబాటులో ఎందుకు ఉండడంలేదు
- ప్రిన్సిపాల్‌పై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆగ్రహం
- కేజీబీవీ, ఆదర్శ, జడ్పీ పాఠశాలల తనిఖీ

వీర్నపల్లి, సెప్టెంబర్ 21: పాఠశాల భవనం పైఅంతస్తు నుంచి విద్యార్థిని దుంకితే మీరేం చేస్తున్నారు.. ప్రాణనష్టం జరిగితే బాధ్యులెవరు, సిబ్బంది ఎందుకు అందుబాటులో ఉండడంలేదని కేజీబీవీ ప్రిన్సిపాల్, సిబ్బందిపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒత్తిడి తట్టుకోలేక మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని పర్లపల్లి అశ్విత శుక్రవారం సాయంత్రం భవనంపై నుంచి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన తెలిసిందే. శనివారం కలెక్టర్ కేజీబీవీతో పాటు ఆదర్శ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. టీచర్లు వేధిస్తున్నారా..భోజనం సరిగా పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. భవనంపై నుంచి దుంకిన బాలిక మానసిక స్థితిపై ఆరాతీశారు. పాఠశాలలో తన తోపాటు తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌ఐ ఫోన్ నంబర్లు ఏర్పాటు చేస్తామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలుపాలని సూచించారు. పాఠశాల ఆవరణ, తరగతులు, వంటగదిని పరిశీలించారు. పై అంతస్తుపై చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మైదానంలో పిచ్చిమొక్కలు పెరగడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రెండు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అక్కడి నుంచి ఆదర్శ పాఠశాలకు చేరుకొని, తరగతి గదులను సందర్శించారు. జడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం టీఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించి, విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు.

భవనంపై పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సమస్యలు తెలుసుకుంటూ.. ఆదేశాలు జారీ చేస్తూ..

మండల కేంద్రంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సుమారు రెండు గంటల పాటు పర్యటించారు. పలు సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేజీబీవీకి వెళ్లే దారిలో వాగు ప్రవహిస్తుండడంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని, వంతెన నిర్మించాలని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ వాగును పరిశీలించారు. త్వరలోనే లోలెవల్ కల్వర్టు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుడైన తన భర్త లింబాద్రి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని, తమను ఆదుకోవాలని వీర్నపల్లికి చెందిన జక్కుల సరిత కలెక్టర్‌ను వేడుకుంది. ఆయన వెంట జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, జీసీడీవో పద్మజ, సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, మండల ప్రత్యేకాధికారి నర్సింలు, ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రఘురాం, ఎంపీవో వజీద్, ఏపీవో శ్రీహరి, నేతలు బోయిని రవి, మల్లారపు అరుణ్, అజయ్, తదితరులున్నారు.

విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ సర్కార్

- సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేసి ఏబీవీపీ నాయకులు

జిల్లా కేంద్రంలోని నేతన్న చౌక్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 21: విద్యావ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ ఆరోపించారు. ఈమేరకు శనివారం జిల్లా కేంద్రంలోని నేతన్న చౌక్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించి, దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం పట్టింపులేని విధానాలతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని గురుకులాలు, హాస్టళ్లలో సమస్యలు అనేకం ఉన్నా బయటకు చెప్పుకోలేక మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఒకే రోజున జిల్లాలో నాలుగు సంఘటనలు జరిగితే పట్టించుకు నే దిక్కులేదని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే విద్యార్థుల బతుకులను ఆగం చేయడమేనా అని ప్రశ్నించారు. జిల్లాలో తరుచూ ఘటనలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎందుకు స్పందించడం లేదో స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకో ని విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, విభాగ్ లా ఫోరం కన్వీనర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

భద్రత కరువైన సంక్షేమ హాస్టల్

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 21 : బీసీ సంక్షేమ హాస్టల్‌కు భద్రత కరువైందని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు అక్కెం నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని గాలిపెల్లి గ్రామ శివారులోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఏబీవీపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం హాస్టల్ విద్యార్థి రోహిత్ పాముకాటుకు గురైన విషయం తెలిసిందేన్నారు. హాస్టళ్లలో ఉండాల్సిన స్టాఫ్ లేకపోవడం వల్ల గ్రామ శివారులో ఉండడంతో పాములు ఎక్కువగా వస్తూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే హాస్టళ్లలో పూర్తిస్థాయి స్టాఫ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేసేలా చూడాలన్నారు. ఒక విద్యార్థి పాము కాటుకు గుర్త్రై ప్రాణాపాయ స్థితిలో ఉన్నా ఇప్పటివరకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రవీణ్, అవినాష్, అభిరామ్, అఫ్రిద్, సాయి, సునీల్ తదితరులున్నారు.

రేషన్ డీలర్ల కేటాయింపులో అవినీతి

- సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 21: సిరిసిల్లలో జరిగిన రేషన్ డీలర్ల నియామకంలో అవినీతి జరిగిందని సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు విమర్శించారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి డబ్బులు తీసుకుని రేషన్ డీలర్ల నియామక ప్రక్రియ చేశారని కాంగ్రెస్ నేతలే ఆరోపించారన్నారు. డీలర్ల నియామకంలో ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నిర్వహించారని ఆరోపించారు. ఈ కారణంగా స్థానికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అన్యాయం జరిగిందన్నారు. పద్మశాలీ సామాజికవర్గం అత్యధికంగా ఉన్న ప్రాంతంలో ఇతరులకు కేటాయించి వారికి అన్యాయం చేశారన్నారు. పద్మశాలీలపై కేకే మహేందర్‌రెడ్డి మరోసారి కుట్ర చేసినట్లు అర్థమవుతుందన్నారు. అర్హులను కాకుండా కాంగ్రెస్ నేతలు డబ్బులు వసూలు చేసిన వారి పేర్లనే ప్రకటించడం సరైంది కాదన్నారు. డీలర్ల నియామకంలో అవినీతి జరిగిందని చెప్పడానికి కాంగ్రెస్ నాయకులే స్వయంగా మీడియా ముందుకు వచ్చి కేకే మహేందర్‌రెడ్డిపై చేసిన ఆరోపణలే నిదర్శనమన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిరిసిల్ల నుంచే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సారంపల్లి మాజీ సర్పంచ్ రమేశ్ మాట్లాడుతూ, రేషన్ డీలర్ల నియామక ప్రక్రియపై ప్రజల్లో అనేక ఆరోపణలు వ్యక్తవుతున్నాయన్నారు. కలెక్టర్ స్పందించి నియామక ప్రక్రియపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొటోకాల్ లేని కేకే మహేందర్‌రెడ్డికి ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ఆఫ్‌లైన్‌లో నిర్వహించారన్నారు. పరీక్ష నిర్వహించిన విధానం, అభ్యర్థుల ఎంపిక, వారికి వచ్చిన మార్కుల వివరాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందన్నారు. కేకే మహేందర్‌రెడ్డి అనుచరులకు మాత్రమే కట్టపెడతామనుకుంటే ప్రజాక్షేత్రంలో ఎండబెడతామని హెచ్చరించారు. సమావేశంలో గొడిసెల ఎల్లయ్య, నక్క కొమురయ్య, శ్యాగ దేవేందర్, ఇమ్మనేని అమర్‌రావు, గుండు ప్రేమ్‌కుమార్, ఆత్మకూరి చంటియాదవ్, ములిగె రాజ్‌కుమార్, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, నల్లవెల్లి బాలకిషన్, నక్క స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

- వేములవాడ జాతర గ్రౌండ్‌లో పురుగుల మందు తాగి మృతి
- పౌల్ట్రీ వ్యాపారంలో మూడు కోట్ల నష్టం
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

వేములవాడ,సెప్టెంబర్ 21: అప్పుల బాధతో వేములవాడ పట్టణంలోని ప్రైవేట్ అద్దె గదుల్లో వ్యాపారి పొన్నాల కరుణాకర్ రెడ్డి (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం, భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన కరుణాకర్ రెడ్డి మంగళవారం నుంచి కనిపించకుండా ఇంటి నుంచి వెళ్లాడని బంధువులు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. అయితే పౌల్ట్రీ వ్యాపారంలో కరోనాకాలం నుంచి నష్టాలను ఎదుర్కొంటూ మూడు కోట్ల వరకు అప్పులు అయ్యాయని బంధువుల ద్వారా తెలిసింది. కరుణాకర్ రెడ్డి గత ఏప్రిల్‌లోనే నెలరోజులు పాటు ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చాడన్నారు. మళ్లీ అప్పుల బాధలు తీవ్రం కావడంతో మంగళవారం కూడా ఇంటి నుంచివెళ్లి కనిపించకుండా వెళ్లిపోయాడు. అయితే వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా సమాచారం అందుకున్న పోలీసులు సిరిసిల్ల ఏరియా దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కరుణాకర్‌కు భార్య ఇద్దరు కుమారులున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

సిబ్బంది కొరతతోనే ప్రమాదం

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్



గాలిపెల్లి బీసీ హాస్టల్ వద్ద మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 21 : బీసీ సంక్షేమ హాస్టళ్ల వద్ద సిబ్బంది కొరతతోనే విద్యార్థులకు ప్రమాదాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని గాలిపెల్లి గ్రామ శివారులోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఆయన సందర్శించి, మాట్లాడారు. శుక్రవారం హాస్టల్ విద్యార్థి రోహిత్ పాముకాటుకు గురవడంతో హాస్టల్‌ను సందర్శించామన్నారు. హాస్టళ్లలో ఉండాల్సిన స్టాఫ్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థులపై ఎలుకలు కరవడం, పాములు కాటు వేయడం వంటి సంఘటనలు ఎన్ని జరిగినా ప్రభుత్వం స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గాలిపెల్లి సోషల్ మీడియా ఇన్‌చార్జి నరేశ్, బీఆర్‌ఎస్వీ నాయకులు శ్రీనివాస్, సాయి కుమార్, వెంకటేశ్ తదితరులున్నారు.

రూ.5.60 కోట్లతో ఈజీఎస్ పనుల నిర్వహణ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 21: తంగళ్లపల్లి మండలంలో ఈజీఎస్ ద్వారా రూ.5.60కోట్లతో పనులు చేపట్టారని డీఆర్డీవో పీడీ శేషాద్రి తెలిపారు. ఈమేరకు శనివారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూడో విడుత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా 2023-24 వరకు చేపట్టిన రూ.5.60 కోట్ల పనులపై తనిఖీలు చేశారు. మండలంలోని 30 గ్రామాల్లో చేపట్టిన పనులను సమీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సామాజిక తనిఖీ కొనసాగింది. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ రమేశ్, ఈజీఎస్ ఏపీవో నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.